క్లుప్తంగా

పరిసరాల శుభ్రతపై ప్రతిజ్ఞ



నున్న(విజయవాడరూరల్): స్వచ్ఛాంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం శనివారం నున్న గ్రామంలో జరిగింది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో తహసీల్దారు బి.సుగుణ, పంచాయతీ కార్యదర్శి కె.సురేష్, సచివాలయ సిబ్బంది గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో గ్రామ పంచాయతీ సిబ్బంది గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన హ్యాక్‌థాన్ ఓమ్నిట్రిక్స్



పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శనివారం జాతీయ హ్యాక్‌థాన్ ఓమ్నిట్రిక్స్ 2025 శనివారం ముగిసింది. గత రెండు రోజులుగా జాతీయ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థులు వినూత్న ఆలోచనలతో సాంకేతిక నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఐటీ విభాగాధిపతి, డీన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఓమిని ట్రిక్స్ కన్వీనర్ డాక్టర్ ఎం.సునీత మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయటానికి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరంతర నైపుణ్యానికి దోహదపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందచేశారు.

పర్యావరణ రహిత దీపావళిపై ర్యాలీ



కంకిపాడు: పర్యావరణ రహిత దీపావళిపై ఈడుపుగల్లు నలంద విద్యార్థులు శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈడుపుగల్లు పాఠశాల వద్ద నుంచి పెనమలూరు సెంటరు వరకూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ పి.నాగలక్ష్మి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి లక్ష్యం కావాలన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీవోఏల ఉద్యోగ కాలపరిమితి ఎత్తివేత



పెనమలూరు: వెలుగులో పని చేస్తున్న విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్స్ (వీవోఏల)ల ఉద్యోగ కాలపరిమితి కూటమి ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు పెనమలూరు నియోజకవర్గంలో వీవోఏలుగా పని చేస్తున్న 104 మంది శనివారం పోరంకిలో ఎమ్మెల్యే బోడెప్రసాద్ సమక్షంలో కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా వీవోఏలు వివరాలు తెలుపుతూ గతంలో ఉద్యోగ కాలపరిమితి 3 సంవత్సరాలు ఉండేదని, కూటమి ప్రభుత్వం 3 సంవత్సరాల ఉద్యోగ కాపరిమతి రెన్యూవల్‌ను ఎత్తివేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలో ఉన్న ఏపీఎంలు జి.కృష్ణంరాజు, మాధవి, అమలేశ్వరరావు, సీసీలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవదిన ప్రార్థనలు



గన్నవరం: స్థానిక ఆర్‌సీఎం అద్భుత బాల యేసు దేవాలయం 10వ వార్షిక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మహోత్సవాల్లో భాగంగా శనివారం నవదిన ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జ్యోతినగర్ విచారణకర్తలు రెవ. ఫాదర్ చేబ్రోలు జోసఫ్ తంబి నేతృత్వంలో పలువురు గురువులు సమిష్టి దివ్యబలి పూజను సమర్పించారు. అనంతరం జపమాల, దివ్యసత్ప్రసాద ఆశీర్వాచనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయేసు యూత్ ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి. గన్నవరం ఆర్‌సీఎం విచారణకర్తలు ఫాదర్ పసల థామస్, దేవార్చన నిర్వాహకులు నిమ్మగడ్డ జోసఫ్, వేమూరి ఏంజల్ విజయకుమార్, చెల్లి సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి మాటున పర్యావరణానికి చేటు!

- పునాదిపాడు జెడ్పీ పాఠశాల స్థలంలో భారీ వృక్షాలు నరికివేత
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



చెట్లు నరికివేసి కలప తరలించగా మిగిలిన మొదళ్లు



నిర్మాణంలో ఉన్న భవనం

కంకిపాడు: హైస్కూల్ ప్లస్ విద్యార్థులకు అవసరమైన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇందుకు దాత సహకరిస్తున్నారు. ఇంత వరకూ బాగానే ఉన్నా ఆ స్థలంలో ఉన్న భారీ వృక్షాలను ఎలాంటి బహిరంగ వేలం వేయకుండా తొలగించటం వివాదాస్పదం అవుతోంది. కలప తరలింపు ద్వారా పాఠశాలకు చేకూరే ఆదాయం కోల్పోయిందని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో ఆరు నుంచి హైస్కూల్ ప్లస్ వరకూ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల పాఠశాలకు వచ్చిన ఓ పూర్వ విద్యార్థి హైస్కూల్‌ప్లస్ విద్యనభ్యసించే విద్యార్థులకు సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చారు. పాఠశాల పూర్వ భవనాలు తొలగించగా ఉన్న ఖాళీ ప్రదేశాన్ని భవన నిర్మాణానికి ఎంపిక చేశారు. ఈ స్థలంలో ప్రస్తుతం భవన నిర్మాణ పనులు చేపట్టారు. పునాదుల దశలో పనులు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు తీసుకొచ్చి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తున్నారు.

చెట్లు తొలగింపు వివాదాస్పదం....

అయితే ఈ స్థలంలో ఉన్న భారీ వృక్షాలను తొలగించారు. ప్రహరీల వెంబడి ఉన్న వృక్షాలను సైతం మొదళ్లతో నరికి కలపను తరలించేశారు. నిబంధనల మేరకు చెట్లు తొలగింపునకు, కలప తరలింపు (సేకరణ)కు బహిరంగ వేలం నిర్వహించాల్సి ఉంది. కానీ అలాంటిదేమీ లేకుండానే చెట్లు నరికి, కలపను స్థానికంగా ఉన్న ఓ కలప వ్యాపారి తరలించుకుపోయాడు. చెట్లు బహిరంగ వేలం ద్వారా పాఠశాలకు కొంత ఆదాయం సమకూరేదని, రహస్యంగా చెట్లు నరికించి, కలప తరలించాల్సిన పని ఏముందంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భారీ వృక్షాల ద్వారా సమకూరే ఆదాయంతో పాఠశాలలో వసతులు సమకూరేవని, ఆ ఆదాయం విద్యాశాఖ కోల్పోయిందని చెబుతున్నారు.

చెట్లు నరికిన మాట వాస్తవమే

> దాత సహకారంతో భవనం నిర్మిస్తున్నారు. భవనం నిర్మిస్తున్న ప్రాంతంలో ఉన్న చెట్లు నరికిన మాట వాస్తవమే. నిబంధన మేరకు వేలం వేయాలి. కానీ దసరా సెలవుల్లో ఈ చెట్లు నరికివేశారు. మాకు ఎలాంటి సమాచారం తెలీదు. శెలవులు అయ్యాక వచ్చి చూస్తే పనులు జరుగుతున్నాయి. పాఠశాలకు భవనం సమకూరుతుంది కదా అని అంతా చూస్తూ ఉన్నాము.
>
> ఎ.వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం, పునాదిపాడు

పేదల ఇళ్లపై కూటమి కన్నెర్ర!

- కానూరులో అర్ధరాత్రి ఉద్రిక్తత
- నిరుపేదల నివాసాలు తొలగించే యత్నం



అధికారులతో మాట్లాడుతున్న చక్రవర్తి

పెనమలూరు: కానూరులో పేదల నివాసాలపై కూటమి సర్కార్ కన్నెర్ర చేసింది. పేదలు రాత్రి ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో రెవెన్యూ, మున్సిపాలిటీ యంత్రాంగం పొక్లెయిన్‌లతో ఇళ్ల నేలమట్టం చేయటానికి రంగంలోకి దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవభక్తుని చక్రవర్తి ఘటని స్థలం వద్దకు వచ్చి పేదలకు అండగా నిలిచారు. గ్రామంలో ముగు కాలవ కట్టపై దాదాపు 48 పేదల కుటుంబాలు గత 40 ఏళ్లుగా నివశిస్తున్నారు. వారిని తొలగించాలని గతంలో రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. దీంతో పేదలకు న్యాయం చేయాలని చక్రవర్తి తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. పేదలకు ప్రత్యామ్నాయం చూపితే స్వచ్ఛందంగా నివాసాలు ఖాళీ చేస్తామని తెలిపారు. దీనికి అంగీకరించిన అధికారులు ఇళ్లను ఆనాడు తొలగించలేదు. అర్ధరాత్రి పేదల ఇళ్లను తొలగించటానికి భారీ బందోబస్తుతో యంత్రాలను తీసుకొచ్చారు. ఒక్కసారిగా ఉలిక్కిపడిన పేదలు ఇదెక్కడి న్యాయమని అధికారులను ప్రశ్నించారు. రాత్రి సమయంలో చిన్నారులు, వృద్ధులతో ఉన్న తమ ఇళ్ల మీదకు రావటమేమిటని ప్రశ్నించారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయనిదే ఇళ్లు ఖాళీ చేయబోమని చెప్పారు. అయినా అధికారులు దూకుడు ఆపకుండా హడావుడి చేశారు. విషయం తెలుసుకున్న దేవభక్తుని చక్రవర్తి ఘటనా స్థలం వద్దకు చేరుకున్నారు. ఆయన అధికారులతో మాట్లాడుతూ గతంలోనే తాము ప్రత్యామ్నాయానికి అంగీకరించామని గుర్తు చేశారు. కానూరు ప్రధాన రహదారి జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో 60 అడుగులు ఉంటే నిబంధనలకు విరుద్ధంగా 30 అడుగుల రోడ్డు వెడల్పుతోనే డ్రెయినేజీలు ఎలా నిర్మాణం ఎలా చేపట్టారని ప్రశ్నించారు. పేదలకు ఒక నాయ్యం, బడా బాబులకు ఒక న్యాయం ఎలా అమలు చేస్తారని నిరసన వ్యక్తం చేశారు. కాగా ఆదివారం, సోమవారం సెలవు దినాలు కావటంతో పథకం ప్రకారం అధికారులు పేదల నివాసాలు తొలగించటానికి వ్యూహం పన్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమ నివాసాలు తొలగిస్తే ప్రాణాలైన వదులుతామన్నారు. పేదలు పెద్ద సంఖ్యలో పేదలు నివాసాల వద్దే ఉన్నారు. కాగా ఇక్కడ ఇంకా ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి.

పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



కంకిపాడు: పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం కంకిపాడు మార్కెట్‌యార్డు ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. పరిసరాలను శుభ్రం చేసి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాల శుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. అనారోగ్యాలు దరిచేరకుండా ఉండేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, వైస్ చైర్మన్ కల్యాణి, సర్పంచ్ బాకీ రమణ, డైరెక్టర్ గోగినేని రమణ, పలువురు నేతలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఖాదర్‌కు నివాళి

పెనమలూరు: కానూరు వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షేక్.ఖాదర్ (58) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కానూరు నుంచి ఎంపీటీసీ సభ్యుడిగా గతంలో ఎన్నికయ్యారు. వైఎస్సార్ సీపీలో చురుకైన నాయకుడిగా ఉన్నారు. ఆయన ఇంట్లో ఉన్న సమయంలో గుండెపోటు రావటంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందారు. ఖాదర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఖాదర్ మృతికి నివాళులర్పించి వైఎస్సార్ సీపీ నేతలు సంతాపం తెలిపారు.

'మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నాం'



రామవరప్పాడు జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

రామవరప్పాడు: అన్నం ముద్ద అవుతోంది, కూరలు రుచి, నాణ్యత ఉండటం లేదు తినలేకపోతున్నామంటూ రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు వద్ద ఏకరువు పెట్టారు. ఇక్కడి భోజనం తినలేక నిత్యం ఇంటి వద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నాం ఇకనైనా మేము పడుతున్న ఇబ్బందులు గుర్తించి పరిష్కరించాలని ఫిర్యాదు చేశారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను యార్లగడ్డ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు లేవని, పాఠశాలకు ఇంత వరకు రంగులు వేయలేదని, మధ్యాహ్న భోజన తయారీకు షెడ్డు లేకపోవడంతో తరగతి గదిలో వంట వండాల్సి వస్తోందని వాపోయారు. దీంతో ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా ఉంటే విద్యార్థులు పాఠశాలలో భోజనం ఎలా తినగలుగుతారని వంట ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట ఏజెన్సీ మార్చి భోజనం నాణ్యత పెంచాలని విద్యాశాఖ అధికారిని ఆదేశించారు. పాఠశాలలో భోజనం తయారీకు షెడ్డు లేని విషయాన్ని తన దృష్టికి తీసుకు రాకపోవడంపై విద్యాశాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వంట షెడ్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. దీనికి స్పందించిన ప్రసాదంపాడు నాయకుడు సర్నాల బాలాజీ ముందుకొచ్చి తాను వంట షెడ్డు నిర్మించి ఇస్తాననడంతో అభినందించారు. జిల్లా పరిషత్ అధికారులతో మాట్లాడి బల్లలు, బెంచీలు ఏర్పాటు చేయిస్తానన్నారు.

పోలీస్‌స్టేషన్లకు హాజరైన మాజీ ఎమ్మెల్యే వంశీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత వల్లభనేని వంశీమోహన్ శనివారం హనుమాన్‌జంక్షన్, వీరవల్లి పోలీస్‌స్టేషన్లలో హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం పెట్టిన పలు అక్రమ కేసుల్లో కండిషనల్ బెయిల్‌పై విడుదలైన ఆయన కోర్టు నిబంధనల మేరకు ప్రతి శనివారం వీరవల్లి, హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్లకు హాజరుకావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన ఈ రెండు పోలీస్‌స్టేషన్లలో శనివారం హాజరై సంతకాలు చేశారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, వైఎస్సార్ సీపీ నాయకులు మూల్పూరు ప్రభుకాంత్, చందు శ్రీనివాసరావు, గూడవల్లి సుధాకర్, కసుకుర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయ స్టాల్స్ ప్రారంభం

గన్నవరం: స్థానిక కోనాయి చెరువు వద్ద బాణసంచా విక్రయ స్టాల్స్‌ను శనివారం ప్రారంభించారు. దీపావళి పండుగ సందర్భంగా మూడు రోజుల పాటు బాణసంచా విక్రయించేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ ఏడాది మొత్తం 29 స్టాల్స్‌కు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఇప్పటికే బాణసంచా స్టాల్స్ వద్ద భద్రత ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా స్టాల్స్ నిర్వాహకులు జాగ్రత్తలు వహించాలని తహసీల్దారు కేవీ. శివయ్య సూచించారు. ఇప్పటికే బీబీ.గూడెం, పురుషోత్తపట్నంలోని మూడు హోల్‌సేల్ దుకాణాల్లో బాణసంచా విక్రయాలు కొనసాగుతున్నాయి.

వాలీబాల్‌లో సత్తా చాటిన హెచ్‌ఎంకే విద్యార్థులు



సత్తా చాటిన క్రీడాకారులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్ సుకుమిత్‌కౌర్

కంకిపాడు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఉయ్యూరు డివిజన్ స్థాయిలో ఇటీవల నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో గోసాల హెచ్‌ఎంకే విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పాఠశాల ప్రిన్సిపాల్ సుకుమిత్ కౌర్, డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్ శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17న ఉయ్యూరులోని శ్రీ విశ్వశాంతి పాఠశాలలో వాలీబాల్ డివిజన్ స్థాయి పోటీలు, జిల్లా జట్ల ఎంపిక జరిగిందన్నారు. అండర్ –14లో పాఠశాల జట్టు ప్రథమస్థానాన్ని, అండర్–17 సీనియర్స్ విభాగంలో రెండో స్థానాన్ని కైవసం చేసుకున్నాయని చెప్పారు. జూనియర్స్ విభాగంలో కనుగుల తేజస్వి, గంట భవాని, శ్రీచంద్రకళ, గుంటూరు జ్వలిత ఎంపిక కాగా, సీనియర్స్ విభాగానికి రాజులపాటి దీపిక, యార్లగడ్డ నిరుపమ, మురపాల అక్షయ, సీనియర్స్ బాలుర విభాగంలో గంజి సమీర్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కె.రాజును ప్రత్యేకంగా అభినందించారు.



ప్రమాదభరితంగా రహదారి

మద్దూరు–గోసాల రోడ్డు గుండా ప్రయాణం అంటేనే జనం హడలెత్తిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఈ మార్గంలో పది మంది కిందపడి గాయాలపాలయ్యారు. ఓ మహిళ తుంటి జారి ఆసుపత్రి పాలైంది. అసలే గోతులతో నిండిన రోడ్డు మార్గం, పైగా వర్షాలతో రోడ్డుపై నీరు నిలిచిపోయి గుంతలు చిన్నపాటి చెరువును తలపిస్తుండటంతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. రోడ్డుపై ప్రయాణం అంటేనే సర్కస్ ఫీట్లు గుర్తుకొస్తున్నాయంటూ వాహనదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రమాదభరితంగా మారిన రోడ్డుకు మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

కంకిపాడు

దుకాణాల ఏర్పాటుకు అనుమతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో 24 బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చినట్లు తహసీల్దార్ బి.మురళీకృష్ణ శనివారం తెలిపారు. హనుమాన్‌జంక్షన్‌లో 17 షాపులు, వీరవల్లి, వేలేరు, మల్లవల్లి, బండారుగూడెం, ఎ.సీతారామపురం గ్రామాల్లో మరో 7 తాత్కలిక బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చామని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాణాసంచా దుకాణాలు నిర్వహించాలని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆయన సూచించారు. కాగా, హనుమాన్‌జంక్షన్‌లో నూజివీడు రోడ్డులోని శ్రీనివాస థియేటర్ ప్రాంగణంలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటుకు నిర్వహకులు సన్నాహాలు చేస్తున్నారు.

పెళ్లి చూపులు ఇష్టంలేక యువతి ఆత్మహత్య

పెనమలూరు: పెళ్లి చూపులు ఏర్పాటు చేయటం ఇష్టం లేక కానూరులో యువతి (25) ఆత్మహత్య చేసుకున్న ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.... కానూరులో యువతి ఈడుపుగల్లు ప్రైవేట్ మెడికల్ అకాడమీలో పని చేస్తుంది. ఆమెకు తల్లిదండ్రులు పెళ్లి చేయాలని నిర్ణయించారు. యువతిని పెళ్లి చూపులు చూడటానికి హనుమాన్‌జంక్షన్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం పెళ్లి కుమారుడి తాలూకు రావాల్సి ఉంది. అయితే అర్జంట్ పని పై యువతి తల్లిదండ్రులు శుక్రవారం ఉదయమే గుడివాడ వెళ్లారు. ఇంట్లో యువతి, ఆమె సోదరుడు మాత్రమే ఉన్నారు. అయితే యువతికి పెళ్లి ఇష్టం లేక పోవటంతో ఇంట్లో తన గదిలో చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుంది. ఇంట్లో ఉన్న సోదరుడు చూసి వేలాడుతున్న ఆమెను కిందకు దించి కాపాడే యత్నం చేయగా అప్పటికే ఆమె మృతి చెందింది. పెళ్లి ఇష్టం లేకే తమ కుమార్తె చనిపోయిందని పోలీసులకు తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

నున్న(విజయవాడరూరల్): నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో 13వ తేదీ నుంచి ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అటల్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖపట్నంకు చెందిన ఎన్ఎస్‌టీఎల్–డీఆర్‌డీఏ సైంటిస్ట్ డాక్టర్ వి.రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశం అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ముఖ్యంగా రక్షణ, తయారీ, సాంకేతిక రంగాల్లో భారత్ స్వావలంబన సాధించిందని చెప్పారు. కోఆర్డినేటర్ డాక్టర్ కిషోర్‌రెడ్డి, గురుమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్, కాలేజి సెక్రటరీ ఎన్.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదు



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

గన్నవరం: ప్రజాస్వామ్యాన్ని కాలరాసే విధంగా సాక్షి ఎడిటర్, విలేకరులపై పోలీస్ అక్రమ కేసులను నిరసిస్తూ శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద జర్నలిస్టులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు కె. వెంకటశివయ్యకు ఏపీయుడబ్ల్యూజే నియోజకవర్గ అధ్యక్షులు కె. కరుణాకర్, ప్రధాన కార్యదర్శి ఆర్. శివరాంబాబు నేతృత్వంలో వినతిపత్రం అందజేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తెలిపారు. కల్తీ మద్యంపై వార్తలు ప్రచురించినందుకు సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, విలేకరులపై అక్రమ కేసులు పెట్టి విచారణ పేరుతో వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. ఇప్పటికైన అక్రమ కేసులను ఉపసంహరించుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడాలని డిమాండ్ చేశారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు దావీదు, సిహెచ్. మురళీ, శ్రావణ్, కె. మురళీ, ప్రేమ్‌చంద్, రాజేష్, వినోద్, ఉదయ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యానర్ల ఏర్పాటు పై వివక్ష తగదు



నున్నలో పంచాయతీ కార్యదర్శితో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నున్న(విజయవాడరూరల్): గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బ్యానర్లు ఏర్పాటు విషయంలో అధికారులు వివక్ష చూపిస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ నాయకులు పంచాయతీ కార్యదర్శి పై మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ జన్మదినోత్సవం సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు పంచాయతీ కార్యాలయం వద్ద బ్యానర్ ఏర్పాటు చేశారు. ఆ బ్యానరును చెప్పకుండా పంచాయతీ అధికారులు తొలగించారు. ఇటీవల టీడీపీ నాయకులు పుట్టినరోజు, సినిమా రిలీజు, ఇంకా చోటా మోటా నాయకుల పుట్టినరోజు వేడుకలంటూ పంచాయతీ కార్యాలయం వద్ద పెద్ద పెద్ద బ్యానర్లు ఏర్పాటు చేశారు. అప్పుడు లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకంటూ వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామ పంచాయతీ ఈవోను ప్రశ్నించారు. పై నుంచి ఒత్తిడి వచ్చిందంటూ ఈవో సమాధానం చెప్పారు. ఈ వ్యవహారాన్ని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ దృష్టికి తీసుకెళ్లారు. పై నుంచి ఒత్తిళ్ళు వచ్చిన మాట వాస్తవమేనని ఎంపీడీఓ చెప్పగా పంచాయతీ పాలకవర్గం, మండల పరిషత్ పాలకవర్గం వైఎస్సార్‌సీపీదే అయినప్పుడు ఒత్తిళ్ళు రావడం ఏమిటని ప్రశ్నించారు. అయినా అధికార పార్టీవారికి లేని ఒత్తిళ్ళు మాకే వచ్చాయని ప్రశ్నించడంతో ఇక నుంచి ఏ రాజకీయ బ్యానర్లు కట్టకుండా పంచాయతీ తీర్మాణం చేస్తామని ఎంపీడీఓ చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. ఈ సమస్య పై ఈవోతో మాట్లాడిన వారిలో మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, ఉపసర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ప్రత్తిపాటి రవీంద్ర, పోలారెడ్డి ప్రసాద్ రెడ్డి, పలువురు పార్టీ నాయకులున్నారు.

గన్నవరంలో పొగాకు వ్యతిరేక ర్యాలీ



పొగాకు వ్యతిరేక ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నేషనల్ టోబాకో కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్‌టీసీపీ) ఆధ్వర్యంలో పొగాకు రహిత యువత 3.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రస్తుతం యువతలో పొగాకు వాడకం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుందన్నారు. దీనివల్ల యువత ఆరోగ్యానికి నష్టం కలగడంతో పాటు సమాజానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేందుకు ప్రతిఒక్కరూ తమ కుటుంబాల్లో పొగాకు వ్యసనాన్ని నిరోధించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు గురించి యువతలో చైతన్యం తీసుకురావాలని కోరారు. పాఠశాల హెచ్‌ఎం ఏ. సునీల, పలువురు ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.